సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 8 । జూలై । 2025



ఏడీసెట్ విడుదల చేయపోవడం వెనుక రాజకీయ కుట్ర

ఏడీసెట్ విడుదల చేయకపోవడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అనుమానం వ్యక్తం చేశారు. - 8లో



వేంపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

వేంపల్లె పంచాయితీ పరిధిలోని పక్కీర్‌పల్లెకు చెందిన సయ్యద్ సుమియా(18) అనే బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన సోమవారం పకీరు పల్లె గ్రామంలో కలకలం రేపుతోంది. - 8లో



అండగా ఉంటా!



పులివెందుల ప్రాంత నాయకులతో మాట్లాడుతున్న అధినేత వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని.. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు.

రెండు రోజుల జిల్లా పర్యటన కోసం సోమవారం సాయంత్రం పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్ తన క్యాంప్ కార్యాలయంలో ప్రజలతో మమేకమయ్యారు. అందర్నీ ఆప్యాయంగా పలకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా.. తమ అభిమాన నాయకుడిని చూడడానికి జనం తరలిరావడంతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది.



జగన్ మామయ్యను చూసిన ఆనందంలో చిన్నారి









పేద ప్రజలు, కార్యకర్తలు,నాయకుల సమస్యలను ఓపిగ్గా వింటున్న మాజీ సీఎం వైఎస్ జగన్



హెలీప్యాడ్ వద్ద వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న జనం



పేదల దేవుడు



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడి పేరు గాజులపల్లె హేమంత్ నరసింహారెడ్డి. బద్వేలు మండలం బయనపల్లె గ్రామం. నరసింహారెడ్డి, నాగేశ్వరమ్మ దంపతుల సంతానమైన హేమంత్ నరసింహారెడ్డి పుట్టుకతోనే చెవుడు, మూగ. రెండేళ్ల వయస్సులో సమస్యను గుర్తించే సరికే తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో తల్లి తల్లడిల్లిపోయింది. దిక్కుతోచని ఆ పరిస్థితుల్లో అప్పటి సీఎం వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఆ కుటుంబాన్ని ఆదుకుంది. హైదరాబాద్‌లో రూ.6 లక్షలు విలువైన ఆపరేషన్ చేసి కాంక్లియర్ ఇన్‌ప్లాంటేషన్ మిషన్ అందజేశారు. తన కుమారుడికి మాట వచ్చేలా సహకరించిన వైఎస్సార్‌ను జీవితాంతం గుర్తుంచుకుంటామని తల్లి నాగేశ్వరమ్మ ఆనందం వ్యక్తం చేస్తోంది.

- మరుపురాని మనిషి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్
- నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి
- ఇడుపులపాయ ఘాట్‌లో నివాళులు అర్పించనున్న కుటుంబ సభ్యులు
- ఊరు వాడా విస్తృత సేవా కార్యక్రమాలకు సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, కడప : వైఎస్సార్.. ఈ పేరు వింటే తెలుగు ప్రజల గుండె తడవుతుంది.. మనసు ఉప్పొంగుతుంది.. ఈ ఒక్క పేరు ఎందరికో జీవం పోసింది.. మరెందరికో స్ఫూర్తినిచ్చింది. కోట్లాది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అపురూపమది. తెలుగు నేల ఉన్నంతకాలం మరుపురాని పేరు.. వైఎస్సార్. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మనతో లేరు. ఆయన ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పథకాలు ఇప్పటికీ మనతో ఉన్నాయి. తరాల తరబడి దారిద్ర్యంతో కొట్టు మిట్టాడుతున్న పేదలకు ఫీజురీయింబర్స్‌మెంటు పథకం తలరాతలు మార్చివేసింది. పేదలకు ఆరోగ్యశ్రీ పథకం పునర్జన్మ కల్పించింది. ఇళ్లు లేని నిరుపేదలందరికీ గూడు కల్పించిన వైఎస్సార్ కల్పవృక్షమై నీడనిచ్చారు. అణగారిన వర్గాల ఉన్నతి కోసం రిజర్వేషన్లు కల్పించి చరిత్రను తిరగరాశారు. ఆరుగాలం శ్రమించినా ఫలితం దక్కని రైతన్నకు దన్నుగా నిలుస్తూ తోడునీడగా పెద్దన్న పాత్రను పోషించారు. ఒకటా రెండా..తన ఐదున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాలకు ఏదో ఒక ప్రయోజనం కల్పించిన ఘనత ఆయనకు సొంతమైంది.

మానవత్వం మూర్తీభవించిన నాయకుడు....

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మానవత్వం మూర్తీభవించిన నాయకుడు. అనంతపురం నుంచి అదిలాబాద్ దాకా.. శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా .. వైఎస్సార్ పేరు వినిపిస్తే తెలుగు ప్రజల మనస్సు పులకిస్తుంది. అందుకు కారణం రాజకీయాలకు అతీతంగా పేదలను ప్రేమించడం, వర్గాలకు, పార్టీలకు, ప్రాంతాలకతీతంగా సమగ్రాభివృద్ధి శ్రీకారం చుట్టడమే. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రజానీకం ఘనంగా నిర్వహించుకునేందుకు సన్నాహాలు చేసుకున్నారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తనయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైఎస్ కుటుంబసభ్యులు ఇడుపులపాయలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొననున్నారు.

జిల్లాపై ప్రత్యేక ముద్ర

నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్న కడప జిల్లాపై డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక ముద్ర వేశారు. 2004లో ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధిని నలుదిశలా పరుగులు పెట్టించారు. 2004-09 వైఎస్ హయాంలో యోగివేమన యూనివర్శిటీ, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పశువైద్య విద్య కళాశాలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆసుపత్రి, దంత వైద్యశాల, అలాగే ట్రిపుల్ ఐటీ, ఐ.జి కార్ల్ పశు పరిశోధన కేంద్రం, దాల్మియా, భారతి సిమెంటు కర్మాగారాలు, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్ తీసుకొచ్చారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను డాక్టర్ వైఎస్‌ఆర్ హయంలో శరవేగంగా చేపట్టారు. ఎన్నికలప్పుడు మాత్రమే శంకుస్థాపనలు చేసే తెలుగుదేశం పార్టీ నాయకులకు కనువిప్పు కలిగించారు. సుమారు రూ.12వేల కోట్లతో జలయజ్ఞంలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశారు. గాలేరు నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలను వైఎస్‌ఆర్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆధునికీకరణ, గండికోట రిజర్వాయర్, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. జిల్లాలో వేగవంతంగా వృద్ధి సాధించింది. నాయకుడంటే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిలా ఉండాలని, ప్రజలపై మానవత చూపాలని, అందుకే యావత్తు భారతదేశానికి ఆదర్శప్రాయుడుగా నిలిచారని పరిశీలకులు ఇప్పటికీ కొనియాడుతుండడం విశేషం.

మనసున్న మారాజతడు!

పారే నీరు.. పచ్చని పైరు..
అతని నేస్తాలు!

స్వచ్ఛమైన చిరునవ్వు..
అచ్చ తెలుగు మాట తీరు..
అతని ఆయుధాలు

పసిపిల్లల బోసినవ్వతడు
పండు ముసలోళ్ల
పెద్ద మనవడూ అతడే!

నిరుపేదల గుండెచప్పుడతడు
రోగుల పాలిట మహా దేవుడతడు!

అనాథల ఆత్మీయ బంధువతడు
అక్క చెల్లెమ్మలకు వరాలిచ్చిన
పెద్దన్నతడు

ఆరోగ్యశ్రీకి ఆయువు పోసిందతడే
అభాగ్యుల అభయహస్తమై
నిలిచిందీ అతడే!

అభివృద్ధికి కొత్త బాట వేసిందతడే
సంక్షేమానికి నవ భాష్యం
లిఖించిందీ అతడే!

తెలుగు నేలపై ..
నిండు వెలుగై ఉదయించినోడు..

ఇచ్చిన మాట కోసమే వెళ్తూ..
అస్తమించినాడు..

ఆదరించడంలో తన..
మన తేడా చూపించని..
మనసున్న మా'రాజ'తడు..
మా రాజశేఖరుడతడు!!

ఆరోగ్యశ్రీ పునర్జన్మనిచ్చింది



నాపేరు షేక్ ఆశాబీ. మాది రాజంపేట పట్టణంలోని బాలాజీనగర్. దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం వల్ల పునర్జన్మ పొందాను. ఆపరేషన్‌కు ఒక్కరూపాయి కూడా ఖర్చు కాలేదు. గుండెకు పెద్ద ఆపరేషన్ చేయాలంటే లక్షల రూపాయలు ఖర్చు అవుతుందంట. ఆరోగ్యశ్రీ పథకమే లేకుంటే నేను గుండెకు పెద్ద ఆపరేషన్ చేయించుకోలేక ఈ పాటికి ఈలోకానికి దూరం అయ్యేదానిని. వైఎస్సార్ ఇప్పుడు లేకపోయినా ఆయన పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం మాలాంటి పేదోళ్లకు పునర్జన్మ ఇస్తుంది. ఆయన చనిపోయి ఏళ్లు గడుస్తున్నా పేద ప్రజల గుండెల్లో ఉన్నాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదరికం తగ్గుముఖం



నాపేరు తంబెల దీప్తి. మాది రాజంపేట. మధ్యతరగతి కుటుంబం. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల నేను బీటెక్ పూర్తిచేసి క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం దేశంలో టాప్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఒకటైన యాక్సెంచర్ కంపెనీలో మంచి ప్యాకెజీతో ఉద్యోగం చేస్తున్నాను. అదే ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం లేకుంటే పేద, మధ్య తరగతికి చెందిన కొన్ని లక్షల మంది ఉన్నత చదువులకు దూరం అయ్యేవారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల తెలుగు రాష్ట్రాల్లో కొన్ని లక్షల కుటుంబాలు పేదరికం నుంచి బయటపడ్డాయి.

రాజన్నను మరవలేను



నా పేరు ఆదెమ్మ, మాది నీరుగట్టువారిపల్లె. చేనేత కార్మికురాలు. నాకు నలుగురు బిడ్డలు. చీరలు నేస్తేనే ఇల్లు గడుస్తుంది. పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకురావాలన్నదే తపన. మహానేత రాజన్న పుణ్య మాని నా పెద్ద కుమార్తె ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటి సీటు వచ్చింది. బీటెక్ పూర్తి చేసి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తుంది. రెండవ కుమారుడు హేమంత్‌కుమార్ బీటెక్ పూర్తి చేసి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మూడవ కుమార్తె మంజుల బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. నాల్గోవాడు బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. వైఎస్సార్ పథకాల వల్లే మా పిల్లలు ఉన్నత స్థితిలో ఉన్నారు. ఆయన రుణం మరవలేను.

యూనివర్సిటీ వైఎస్సార్ చలువే



రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేటలో హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారు. మా గ్రామం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం మహానేత చలువే. నేడు వేలాది మంది విద్యార్థులు వ్యవసాయ విద్యను అభ్యసిస్తూ.. రాష్ట్రానికే తలమానికంగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఆకేపాటి రంగారెడ్డి, స్థానికుడు

రుణమాఫీ రైతులకు ఓ వరం



పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకం రైతులకు ఎంతో ఊరట నిచ్చింది. దీంతో అప్పులన్నీ తీరిపోయి నిలదొక్కుకున్నాం. రాష్ట్రంలో మాలాంటి ఎంతో మంది రైతులకు ఈ పథకం ఓ వరంలా మారింది.

– శ్రీనువాసులరెడ్డి, రైతు, కొర్రపాడు గ్రామం, రాజుపాళెం మండలం

వైఎస్సార్.. దేవుడు



దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థులకు ఓవరంలా మారింది. ఆ పథకమే లేకుంటే నేను ఎంబీఏ చదివే వాడిని కాదు. ఆయన చలువ వల్ల ఎంబీఏ పూర్తి చేయగలిగాను. రూ.37000 డబ్బులు కూడా వచ్చింది. మాలాంటి వాళ్లకు వైఎస్ఆర్ దేవుడు.

– రామకృష్ణ, రాజుపాళెం మండలం, ఎంబీఏ విద్యార్థి.

న్యూస్‌రీల్

నేడు ఎంపికలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్‌లో మంగళవారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సబ్ జూనియర్ బాలుర జిల్లా ఎంపికలు జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

9న క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపికలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 9,11 తేదీల్లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో కడప క్రీడా పాఠశాల 4,5 తరగతులలో ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు చేపట్టనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఒరిజనల్ ధ్రువీకరణ పత్రంతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

రైల్వేట్రాక్ తనిఖీ

ముద్దనూరు: గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్త సిబ్బందితో కలసి సోమవారం రైల్వే ట్రాక్‌ను తనిఖీ చేశారు. ముద్దనూరు-జమ్మలమడుగు రహదారిలో ప్రధాన రైల్వే గేటు పనితీరును ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు డీఓఎం పూర్ణచంద్రరావు,స్టేషన్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం అందించాలి

- జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచిస్తూ అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ వెంకటపతి, మెప్మా పీడీ కిరణ్ కుమార్,వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ అదితిసింగ్

మృగరాజుపై రారాజు

నందలూరు : శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు సోమవారం సింహవాహనంపై శ్రీ సౌమ్యనాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఉభయ దేవేరులతో శ్రీ సౌమ్యనాథ స్వామి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారు సింహవాహనంపై మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని గోవింద నామస్మరణలతో ఊరేగింపు వెంట కదిలివచ్చారు. సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు..

- బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు మంగళవారం ఉదయం పల్లకీసేవ గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హనుమంతు వాహనంపై విహరించనున్నారు.



గ్రామోత్సవంలో సింహ వాహనంపై సౌమ్యనాథుడు

క్లుప్తంగా

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సాధికారత అధికారి సూచనల మేరకు 2025 సంవత్సరానికి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. జాతీయ స్థాయిలో క్రీడల సంఘ సేవ, టెక్. పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 18 సంవత్సరాలలోపు వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 31వ తేదీలోపు హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన జీవరత్నమ్మ (72) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లయ్యకు కళ్లు కనబడవు. మాటలు కూడా సరిగా వినిపించవు. రోజు మేకలు మేపుకోవడానికి వెళ్తుంటాడు. అతను ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి రాగా తాగొద్దని భార్య మందలించేది. ఎంత చెప్పినా మందు తాగడం మానుకోలేదని ఆమె ఆదివారం రాత్రి విషద్రావణం తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి



విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న లైన్‌మన్



శివారెడ్డి మృతదేహం

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామ సమీపంలో సోమవారం విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై విద్యుత్ లైన్‌మన్ మృతి చెందాడు. వేంపల్లె మండలం నందిపల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి (38) పులివెందులలో విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా ఓ రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసేందుకు వెళ్లి అక్కడ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో అప్పుల బాధ తాళలేక మూలింటి నాగార్జున (35) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగార్జున ప్రొద్దుటూరులోని సెలూన్ షాపులో పని చేసేవాడు. అతనికి భార్య గురులక్ష్మితో పాటు ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఇంటి నిర్మాణం కోసం నాగార్జున కొంత అప్పు చేశాడు. అప్పు తీర్చలేక అతను ఇబ్బంది పడేవాడు. అప్పు తీర్చమని ఆరునెలల నుంచి రుణదాతలు అడుగుతుండగా రేపో మాపో ఇస్తామంటూ చెబుతూ వచ్చాడు. అప్పు ఎలా తీర్చాలో భయంగా ఉందని, ఏదైనా చేసుకొని చావాలనిపిస్తోందని అతను భార్యతో చెప్పేవాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగార్జున శ్లాబు కొక్కీకి చీరతో ఉరి వేసుకున్నాడు. పనికి వెళ్లిన భార్య వచ్చి చూడగా అప్పటికే చనిపోయాడు. భార్య గురులక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

వనిపెంట గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం



కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయిని జ్యోతి

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల నిత్యం ఏదో ఒక సమస్యతో వార్తలకెక్కుతోంది. కొద్ది రోజుల క్రితం సరిగా చదవకపోవడం, శుభ్రంగా ఉండటం లేదనే కారణంతో ఓ విద్యార్థినికి ప్రిన్సిపాల్ టీసీ ఇచ్చి పంపిన సంఘటన వివాదాస్పదమైంది. తాజాగా సోమవారం పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న డి.జ్యోతి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వనిపెంటకు చెందిన డి. జ్యోతి 8 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై గురుకుల పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉపాధ్యాయిని జ్యోతి ప్రిన్సిపాల్ నిర్మల ఛాంబర్‌లోకి వెళ్లి టీచింగ్ డైరీ (వర్క్ డన్ స్టేట్‌మెంట్) అందజేశారు. కొద్ది సేపటికి పాఠశాలలోని ఓ గదిలో ఒక్క సారిగా తూలి కింద పడిపోయిన ఆమె అక్కడున్న స్టాఫ్ నర్స్‌తో తాను నిద్ర మాత్రలు మింగానని చెప్పారు. దాంతో అక్కడి సిబ్బంది, కొందరు ఉపాధ్యాయులు ఆమెకు ఉప్పు కలిపిన నీటిని తాగించారు. అంతలోనే పాఠశాల వద్దకు చేరుకున్న ఉపాధ్యాయురాలు భర్త సుధీర్ ఆటోలో ఆమెను తీసుకుని వనిపెంటలోని ఓ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. తన చావుకు ప్రిన్సిపాల్ నిర్మల వేధింపులే కారణమంటూ ఉపాధ్యాయిని జ్యోతి రాసినట్టుగా సోమవారం సాయంత్రం 4 పేజీల సూసైడ్ నోట్ వెలుగు చూసింది. పాఠశాలలో 8 ఏళ్లుగా తాను ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేస్తున్నట్టు ఉపాధ్యాయిని జ్యోతి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాల తెరిచినప్పటి నుండి ప్రిన్సిపాల్ తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తనకు మూడు నెలల పాప ఉన్నా రోజూ అన్ని క్లాసులకు హాజరై పాఠాలు చెబుతున్నానని పేర్కొన్నారు. స్కూల్ విషయాలను బయటికి చేరవేస్తున్నట్టు తనపై అనుమానంతో ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని రాశారు. మిగతా ఉపాధ్యాయినులను తనతో మాట్లాడకుండా కట్టడి చేశారని ఆరోపించారు. తనకు మెమో ఇవ్వాల్సిందిగా తన స్నేహితులతోనే ప్రిన్సిపాల్ చెప్పారని, ఆ అవమానంతోనే తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. పాఠశాలపై ఆరోపణలు వచ్చిన ప్రతి సారి అధికారులు ప్రిన్సిపాల్ చెప్పే మాటలు నమ్మి నిజాలు తేల్చకుండానే వెళ్తున్నారని సూసైడ్ నోట్‌లో ఉపాధ్యాయిని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయిని జ్యోతి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మైదుకూరు అర్బన్ ఎస్ఐ చిరంజీవి, ఎంఈఓ పద్మలత, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్జున్ వేర్వేరుగా పాఠశాల వద్దకు చేరుకుని జరిగిన సంఘటనపై విచారించారు.

వేధించలేదు.. వివరణ కోరాను : ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల

ఉపాధ్యాయిని జ్యోతి ఆత్మహత్యాయత్నంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.నిర్మల మాట్లాడుతూ తాను ఉపాధ్యాయిని జ్యోతిని వేధించలేదన్నారు. అందరితోపాటు ఆమె జూన్ నెల టీచింగ్ డైరీ సబ్‌మిట్ చేయలేదని తెలిపారు. సోమవారం తనకి తానే తన ఛాంబర్‌లోకి వచ్చి టీచింగ్ డైరీ ఇచ్చారని చెప్పారు. అందులో ఆమె సెలవులో ఉన్న రోజుల్లోనూ, ఆదివారం కూడా పాఠాలు బోధించినట్టు పొందుపరిచారని వివరించారు. దాంతో అలా తప్పుగా ఎందుకు రాశారని అడిగానని దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా కోరానన్నారు. ఉపాధ్యాయినులు ఎవరు ఆ విధంగా చేసినా వివరణ కోరడం మామూలుగా జరుగుతుందని పేర్కొన్నారు. తన ఛాంబర్ నుంచి ఉపాధ్యాయిని జ్యోతి వెళ్లిన కొద్ది సేపటికి సిబ్బంది వచ్చి తాను నిద్ర మాత్రలు మింగానని జ్యోతి మేడమ్ చెబుతున్నారని తనతో అనగా, వెంటనే చికిత్స కోసం తీసుకెళ్లాలని చెప్పానన్నారు. అదే సమయంలో ఆమె భర్త మరికొందరు బయట వ్యక్తులు పాఠశాల వద్దకు వచ్చి ఆమెను ఆటోలో తీసుకెళ్లారని వివరించారు. కాగా ఉపాధ్యాయిని జ్యోతి తన ఛాంబర్ నుంచి వెళ్లిన కొద్దిసేపటికే కింద పడిపోవడం, అదే సమయంలో ఆమె భర్త పాఠశాల వద్దకు చేరుకోవడం అతని వెనకే ఎలాంటి అనుమతి లేకుండా బయటి వ్యక్తులు మోటార్ బైక్‌లపై పాఠశాలలోకి రావడం ఇదంతా ముందుగా వేసుకున్న పథకంగా అనిపిస్తుందన్నారు. పాఠశాలలో జరిగే సంఘటనల వెనుక బయటి వ్యక్తులు ఉన్నారని ప్రిన్సిపాల్ ఆరోపించారు. గతంలో బయటి వ్యక్తులు పాఠశాలలో ఇష్టారాజ్యంగా ఉండేవారని, తాను ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాక అవన్నీ కట్టడి చేశానన్నారు. ఏదో ఒక విధంగా తనను ఇక్కడి నుంచి పంపించాలని సమస్యలను సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీటీఎంగా ప్రశాంతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్స్ కమర్షియల్)గా ఎంఎస్ ప్రశాంతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె పుత్తూరు డిపో మేనేజర్‌గా పనిచేస్తూ కడప జోన్‌కు బదిలీపై వచ్చారు. ఈమె 2010లో వరంగల్ జిల్లా హన్మకొండలో డీఎంగా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ఉరవకొండ, ధర్మవరం, పుత్తూరులలో పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీటీఎం హరిని వర్క్‌షాప్‌కు బదిలీ చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్సు డిపార్ట్‌మెంట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హత, ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. ఇందులో ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్సు), ఎంటెక్ (కంప్యూటర్ సైన్సు), ఎంటెక్(డేటా సైన్సు)లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు కంప్యూటర్ డిపార్ట్‌మెంట్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం

జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో డి.టి.సి. డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏడీసెట్ విడుదల చేయపోవడం వెనుక రాజకీయ కుట్ర

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల దీక్షలకు మద్దతు తెలుపుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం ఆర్కిటెక్చర్ అండ్ డిజైనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏడీసెట్) విడుదల చేయకపోవడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఎదుట ఆరు రోజులుగా విద్యార్థులు చేస్తున్న నిరాహార దీక్షలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్యతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ ఈ యూనివర్సిటీకి సీఓఏ పర్మిషన్ వెంటనే ఇవ్వాలన్నారు. ఏడీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఈ ఏడాది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యలను తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు ఆయన ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గురు ప్రసాద్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గురు సాయి దత్త, నాయకులు ఇబ్రహీం మియా, సాయిఫ్, తదితరులు ఉన్నారు.

వాసుకు శృంగభంగం..!

- తిరగబడ్డ తెలుగుతమ్ముళ్లు
- కనీస సమాచారం లేకుండా ఎలా వస్తారు..
- తామంతా టీడీపీకి సపోర్టు చేసింటేనే మాధవీ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు
- వైఎస్సార్‌సీపీలో గెలిచిన కార్పొరేటర్లను వెంట బెంటుకున్నారు
- ఇదేనా కార్యకర్తలకు మీరిచ్చే భరోసా

సాక్షి ప్రతినిధి, కడప : వెంకీ పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లుగా 'సుపరిపాలన-ఇంటింటికీ మన ప్రభుత్వం' కార్యక్రమం ఉండిపోయింది. ప్రజలకు సంక్షేమ పథకాలు కోత కారణంగా వారు ఎంచుకున్న ఇళ్లకు మాత్రమే అధికార పార్టీ నేతలు వెళ్తున్నారు. ఇలా వెళ్తున్నా ప్రజల నుంచి చీదరింపులు తప్పడం లేదు. మరోవైపు తెలుగుదేశం నేతల వ్యవహారశైలిపై ఏకంగా తెలుగుతమ్ముళ్లు మండిపడుతున్నారు. తాజాగా సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డికి కడప నగరం ఎస్టేట్‌లో శృంగభంగం ఎదురైయ్యింది.

సుపరిపాలన-ఇంటింటికీ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్టేట్‌కు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వెళ్లారు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ జెండా కట్టినోళ్లను కాదనీ, పార్టీ కోసం పనిచేసినోళ్లను కాదని ఎలా వచ్చారంటూ స్థానిక టీడీపీ నేత కొండా సుబ్బయ్య నిలదీశారు. మేమంతా జెండా మోసినోళ్లం ఈరోజు ఎక్కడున్నాం, మా ఏరియాలో మీరు వస్తున్న విషయమన్నా మాకు చెప్పారా...వైఎస్సార్‌సీపీలో కార్పొరేటర్లుగా గెలిచినోళ్లను వెంటబెట్టుకుని వస్తారా.. టీడీపీ కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకులు లేరా.. ఇదేనా కార్యకర్తలకు మీరిచ్చే భరోసా.. అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినట్లు సమాచారం. కొండా సుబ్బయ్యను కొందరు శాంతింపజేసే ప్రయత్నం చేయగా, పార్టీ కోసం కష్టపడ్డోళ్లకు ఆ బాధ తెలుస్తోందని వాపోయారు. కాగా, సుబ్బయ్య ఇంటికి తర్వాత నగరంలోని పోలీసు అధికారులను పంపినట్లు సమాచారం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే పోలీసులను ఇంటికి పంపుతారా.. అంటూ ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వద్దే తేల్చుకుంటామని ఊగిపోవడంతో అక్కడి నుంచి సర్దుబాటు చేసుకొని పోలీసు అధికారులు జారుకోవడం విశేషం.

నకిలీ కరెన్సీ నోట్ల ముఠా గుట్టురట్టు

- 10 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- నిందితులు కర్ణాటకతోపాటు అన్నమయ్య జిల్లా వారిగా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ

సాక్షి రాయచోటి : నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న ఒక పెద్ద ముఠా గుట్టు రట్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని డీపీఓలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌ల సమక్షంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. నకిలీ కరెన్సీ కేసుకు సంబంధించి 10 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వాయల్పాడులోని లక్కీ బ్రాందీ షాపు మేనేజర్ నవీన్ కుమార్ దగ్గరకు ఈనెల 26వ తేదీన 500 రూపాయల నోటుతో మద్యం కొనేందుకు కాలేషా అనే వ్యక్తి వచ్చాడన్నారు. ఇంతకు ముందు కూడా రెండుసార్లు దొంగ నోట్లు ఇచ్చావని, తిరిగి ఇప్పుడు దొంగ నోటు తెచ్చావని అనగానే కాలేషా పారిపోయాడన్నారు. లక్కీ వైన్ షాప్ మేనేజర్ నవీన్ కుమార్ వెంటనే వాయల్పాడు పోలీస్ స్టేషన్‌లో సీఐ జె.ప్రసాద్ బాబుకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నకిలీ కరెన్సీ నోట్ల ముఠా చీకటి పడగానే 500 రూపాయల నకిలీ కరెన్సీని మార్చే పనిలో ఉందన్న విషయం పసిగట్టిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. నకిలీ కరెన్సీ చలామణిపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా సమాచారం ఆధారంగా ఈ ముఠా మదనపల్లి- బెంగళూరు ప్రధాన రహదారిలో వాయల్పాడు క్రాస్ వద్ద గల నయారా పెట్రోల్ బంక్ దగ్గరలో ఉన్నారని వాయల్పాడు సీఐ తమ సిబ్బందితో వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు.

10 మంది నిందితుల అరెస్టు.. సామగ్రి స్వాధీనం

నకిలీ కరెన్సీ నోట్ల చలామణి నిందితులను చుట్టుముట్టి పట్టుకుని పెద్దమనుషుల సమక్షంలో విచారించగా షేక్ కాలేషా వలీ ద్వారా తీగ లాగితే డొంక కదిలినట్లు తెలిపారు. ఈ ఘటనలో షేక్ కాలేషా వలీ అలియాస్ కలేసా, వీయం ముస్తాక్ అహమద్ అలియాస్ ముత్తు, ఎస్ఎండీ హఫీజ్, భీమసింగ్ పండిట్ రాథోడ్ అలియాస్ భీమసింగ్ రాథోడ్, టి.కుమారస్వామి అలియాస్ కుమార్, షేక్ షఫీక్ అహ్మద్ అలియాస్ షఫీ, నందిమంగళం యెజాజ్ పాషా అలియాస్ యెజాజ్, వీఎం .ఫుర్ఖాన్, షేక్ ఆసిఫ్, షేక్ సుహెల్‌లు ఉన్నారన్నారు. వీరితో సంబంధమున్న కర్ణాటకకు చెందిన రాథోడ్, కుమార్, బాబు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి 735 నకిలీ 500 రూపాయల నోట్లు, ఒక ఎప్సాన్ ఎకో ట్యాంక్ ఎల్3210 ప్రింటర్, టీఎన్‌పీఎల్ ఏ4 800 జీఎస్ఎం పేపర్ల మూడు పెట్టెలు, ఒక లెనివో ల్యాప్‌టాప్, 12 సెల్‌ఫోన్లు, ఆర్‌బీఐ అక్షరాలతో ముద్రించబడిన ఆకుపచ్చ రిబ్బన్ స్వాధీనం చేసుకున్నామన్నారు, దొంగనోట్ల చలామణి గురించి ఒప్పుకున్నారని, వీరు ముగ్గురిపై ఇదివరకే కర్ణాటకలో పాత కేసులు ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : దువ్వూరులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఓబులేసుకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ ఓబులేసు దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతను ఆదివారం రాత్రి విధులు ముగించుకొని కారులో ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. అయితే మార్గం మధ్యలో పెట్రోల్ అయిపోవడంతో కారు ఆగిపోయింది. అతను కారు పక్కన నిల్చొని ఉండగా మరో కారు వచ్చి ఢీ కొంది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వేంపల్లె మండలం నందిపల్లి గ్రామ సమీపంలోని చెరువు వద్ద సోమవారం బైకును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేంపల్లె పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన గంగులయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి బాధితుడిని పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణ కడప సాధనకు శ్రమిద్దాం

ఇన్‌చార్జిమంత్రి సవిత



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జిమంత్రి సవిత


కడప సెవెన్‌రోడ్స్ : స్వర్ణ కడప సాధన కోసం అందరూ సమష్టిగా శ్రమించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ అమలుపై జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. పీ4 ఫౌండేషన్ ద్వారా బంగారు కుటుంబం-మార్గదర్శి విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేదలను అన్ని విధాలా ఉన్నత స్థాయికి తీసుకు వచ్చేందుకు ధనికుల సాయం తీసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో 70 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని వెల్లడించారు. ఆ కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే బాధ్యత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047లో భాగంగా జిల్లా లక్ష్యాన్ని చేరుకోవడానికి రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధిపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏటా 15 శాతం అభివృద్ధి రేటును పెంచుకుంటూ పోవాలన్నది లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మాధవీరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డితోపాటు జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, సీపీఓ హజరతయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగాలలో పర్యటించిన ఇన్‌చార్జి మంత్రి

లింగాల : పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన లింగాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పర్యటించారు. తమకు తల్లికి వందనం అందలేదని, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మంజూరు కోసం వికలాంగ సర్టిఫికెట్లు అందించలేదంటూ పలువురు మంత్రికి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఇచ్చిన హామీలనేకాక మరెన్నో హామీలను నెరవేరుస్తామని చెప్పారు.

గంజాయి కేసులో భార్యాభర్తల అరెస్టు

2.8 కేజీల గంజాయితో పాటు మోటార్ సైకిల్ స్వాధీనం



గంజాయి కేసులో అరెస్టయిన భార్యాభర్తల వివరాలను తెలియజేస్తున్న కడప రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి

కడప అర్బన్ : కడప నగరం డీటీసీ సర్కిల్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్న భార్యాభర్తలను అరెస్టు చేసినట్లు రిమ్స్ పోలీసు స్టేషన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వల్లూరు మండలం తోళ్లగంగన్నపల్లి గ్రామానికి చెందిన చెన్నుబోయిన రాము గతంలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఆ సమయంలో కాకినాడ టౌన్ తుమ్మలపేటకు చెందిన వాసుపిల్లి భారతి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొన్నాడు. ప్రస్తుతం వారిద్దరు కడప శాస్త్రి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎలాంటి పనులకు వెళ్లకుండా గంజాయి వ్యాపారం చేసి తక్కువ సమయంలో డబ్బులు బాగా సంపాదించాలని రాము ఆలోచించాడు. తనకు పరిచయమున్న మహేష్ అనే వ్యక్తి నుండి గంజాయి తెచ్చుకొని విక్రయిస్తున్నట్లు తెలిపారు. సోమవారం డీటీసీ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో దంపతులు బైక్‌పై గంజాయి పెట్టుకొని వస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. భార్యాభర్తల నుండి 2.8 కేజీల గంజాయిని మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రాము అనే నిందితుడిపై గతంలో చైన్ స్నాచింగ్ కేసులు కూడా నమోదయ్యాయి.

బాలిక అదృశ్యం

పోలీసుల అదుపులో అనుమానిత యువకులు



సుమియా (ఫైల్)



వేంపల్లె పోలీస్ స్టేషన్ వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలోని పక్కీర్‌పల్లెకు చెందిన సయ్యద్ సుమియా(18) అనే బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన సోమవారం పకీరుపల్లె గ్రామంలో కలకలం రేపుతోంది. తల్లిదండ్రులు మాబువలీ, రమీజా గొర్రె పిల్లలను మేపుకొని జీవనం సాగించుకునేవారు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు సొంత పని ఉండడంతో కుమార్తె సుమియా చింతలమడుగుపల్లె సమీపంలోని బట్లలకోనకు గొర్రెల పిల్లలను మేపుకునేందుకు తీసుకెళ్లింది. సాయంత్రం 5 గంటలైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గుట్టల ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ నరసింహులు, పోలీసు సిబ్బందితోపాటు బాలిక తల్లిదండ్రులు, బంధువులు చుట్టు పక్కల కొండల్లో పరిశీలించినా గొర్రెల పిల్లలు ఉన్నాయి కానీ, బాలిక కనిపించకపోవడంతో అనుమానాలు వ్యక్తం చేశారు. మద్యం తాగుతూ అదే ప్రాంతంలో చింతలమడుగుపల్లెకు చెందిన ముగ్గురు యువకులు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వాట్సాప్ స్టేటస్‌లో బాలికకు సంబంధించిన వీడియో కనిపించింది. ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపడుతున్నారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాలిక కనపడకపోవడంతో పోలీసు స్టేషన్ వద్దకు పక్కీర్‌పల్లె వద్దకు భారీ సంఖ్యలో వెళ్లారు. బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత



అదృశ్యమైన బాలిక ఆచూకీ తెలపాలంటూ గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టి అద్దాలను, కుర్చీలను విరగ్గొట్టారు. గొర్రె పిల్లలను మేపుకొనేందుకు వెళ్లిన బాలిక సుమీయ అక్కడ స్పృహ తప్పిపోయి రాత్రి 10:30 గంటలకు గొర్ల మంద వద్దకు చేరుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అదృశ్యమైన బాలిక కనిపించడంతో తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. డీఎస్పీ మురళి నాయక్ బాలిక దగ్గరకు వెళ్లి మాట్లాడి తల్లిదండ్రులతో సహా కడప రిమ్స్‌కు తరలించారు. కాగా గ్రామస్తులు మాత్రం బాలికను చూపించాలని పోలీసు స్టేషన్ వద్ద నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఇంటికి రూ.9,150 విద్యుత్ బిల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులోని సుబ్బిరెడ్డి కొట్టాలులో 7/135 నంబర్ గల ఇంటికి జూలై నెలకు సంబంధించి ఒకే మారు రూ.9,150 బిల్లు రావడంతో ఇంటి యజమాని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెలకు సంబంధించి 60 యూనిట్లకు రూ.502 బిల్లు వచ్చింది. జూలై నెలకు సంబంధించి ప్రీవియస్ విద్యుత్ రీడింగ్ 536 యూనిట్లుగా, ప్రజంట్ రీడింగ్ 1582 యూనిట్లుగా నమోదు చేశారు. ఈ ప్రకారం రూ.9,150 బిల్లు చెల్లించాలని సిబ్బంది చెప్పడంతో ఇంటి యజమాని లబోదిబోమంటున్నాడు. ఇదేమిటి బిల్లు ఇలా వచ్చిందని ఇంటి యజమాని ప్రశ్నించగా, అవన్నీ మాకు తెలియదు.. వచ్చిన బిల్లు ప్రకారం మీరు డబ్బు చెల్లించాల్సిందేనని సిబ్బంది సమాధానం ఇచ్చారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.



